TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతిక్షణం న్యాయం కోసం

## గాంధీ ఆస్పత్రిలో 60 పడకలతో కొవిడ్ సెంటర్



**అడ్డగుట్ట, మే 24 NTM 963 న్యూస్ :** కొవిడ్ కలకలం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గాంధీ ఆస్పత్రిలో 60 పడకలతో కొవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మూడు వార్డులను ఆస్పత్రిలో వివిధ చోట్ల ఏర్పాటు చేయగా ఓ వార్డును అత్యవసర విభాగంలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను పర్యవేక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి సారథ్యంలో కమిటీని ప్రకటించారు. ప్రస్తుతం ఎలాంటి కొవిడ్ కేసులు రాకపోయినప్పటికీ ముందుజాగ్రత్తలో భాగంగానే ఈ చర్యలు చేపట్టామని సూపరింటెండెంట్ తెలిపారు. కొవిడ్ నేపథ్యంలో 24గంటలపాటు డాక్టర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు.

సంపుటి : 01 సంచిక : 23 తెలంగాణ సంపాదకులు: శెట్టి వెంకటేశ్ ఆదివారం 25 మే 2025 పేజీలు : 4, వెల: రూ.2/-

# కలిసి పనిచేద్దాం




- టీమిండియా స్ఫూర్తి చాటుదాం.. సాధ్యంకాని లక్ష్యమంటూ ఉండదు
- పెట్టుబడులకు పెద్దపీట వేయండి
- వికసిత భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం
- రాష్ట్రాల అభివృద్ధితోనే ఇది సాధ్యం
- నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

**న్యూఢిల్లీ, మే 24 NTM 963 న్యూస్ :** "రండి.. కలిసి పనిచేద్దాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమిండియా' స్ఫూర్తితో పనిచేస్తే సాధ్యం కాని లక్ష్యమంటూ ఏమీ ఉండదు." అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన 10వ నీతి ఆయోగ్ పాలక సమావేశం జరిగింది. 'వికసిత్ భారత్ 2047 కోసం వికసిత రాష్ట్రాలు' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో మరింత వేగం పుంజుకోవాల్సి ఉందన్నారు. "అభివృద్ధి పనుల వేగం మరింత పెరగాల్సి ఉంది. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమిండియా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే అసాధ్యమంటూ ఏమీ ఉండదు." అని వ్యాఖ్యానించారు. "వికసిత భారత్.. అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే.. భారతదేశం అభివృద్ధి చెందుతుంది. ఇది 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్ష." అని ప్రధాని ఉద్ఘాటించారు. ప్రతి రాష్ట్రం, ప్రతి నగరం, ప్రతి నగరపాలక సంస్థ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనేది ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యసాధనకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే 'వికసిత భారత్' కోసం 2047 వరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, సౌకర్యాలు, మౌలిక వసతులతో ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రధాని సూచించారు.

"ఒక రాష్ట్రం–ఒక ప్రపంచ గమ్యస్థానం.. స్ఫూర్తిని అందిపుచ్చుకుని అభివృద్ధి చేస్తే పొరుగున ఉన్న నగరాలు కూడా అభివృద్ధి చెందుతాయి." అని చెప్పారు. దేశంలో శరవేగంగా పట్టణీకరణ జరుగుతోందని, 'ఫ్యూచర్ రెడీ సిటీస్' దిశగా కలిసి పనిచేయాల్సి ఉందని తెలిపారు. వృద్ధి, సృజనాత్మకత, సుస్థిరత అభివృద్ధికి చోదక శక్తులని ప్రధాని చెప్పారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మహిళల పాత్రను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెట్టుబడులకు మార్గం సుగమం చేయాలని రాష్ట్రాలను ప్రధాని కోరారు. విధానపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా.. పెట్టుబడులకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగు పరిచేందుకు రెడ్ కార్పెట్ పరవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా విద్య, వ్యవసాయం, ప్రజారోగ్యంపై రాష్ట్రాలు ప్రధానంగా దృష్టిసారించాలని ప్రధాని సూచించారు.

కాగా, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక శాఖ మంత్రులు, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆ సీఎంలు దూరం

ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య.. బిజీగా ఉన్న కారణంగా హాజరుకాలేదు. అయితే, ఆయన తన సందేశాన్ని లిఖిత పూర్వకంగా పంపించారు. కేరళ సీఎం పినరయి విజయన్ కూడా హాజరుకాలేదు. తనబదులుగా రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్‌ను పంపించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతున్న పుదుచ్చేరి సీఎం రంగస్వామి, బిహార్ సీఎం నితీశ్‌లు గైర్హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమత కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు.

## ఈడీకో, మోదీకో డీఎంకే భయపడదు.. నీతి ఆయోగ్‌కు స్టాలిన్ హాజరుపై ఉదయనిధి



**చెన్నై NTM 963 న్యూస్ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు కానీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గానీ డీఎంకే భయపడే ప్రసక్తి లేదని, ఎలాంటి అంశాలనైనా లీగల్‌గానే ఎదుర్కొంటామని ఆ పార్టీ నేత, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లనైనా ఎదుర్కొని రాష్ట్ర హక్కులను కాపాడేందుకు తమ పార్టీ కట్టుబడి ఉంటుందని చెప్పారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారంనాడు ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల స్టేట్ రన్ లిక్కర్ కార్పొరేషన్ 'టాస్మాక్' కార్యాలయంపై ఈడీ దాడులు జరిపిన నేపథ్యంలో స్టాలిన్ ఢిల్లీ పర్యటన చేపట్టారని విపక్ష అన్నాడీఎంకే ఆరోపించింది. మోదీ అధ్యక్షతన ఢిల్లీలోని జరిగిన నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్, బీహార్ ,పుదుచ్చేరి హాజరుకాలేదు. కాగా, స్టాలిన్ ఢిల్లీ పర్యటనపై అన్నాడీఎంకే చేసిన వ్యాఖ్యలపై మీడియాతో ఉదయనిధి మాట్లాడుతూ, ఈడీకో, మోదీకో తాము భయపడమన్నారు. కళైంజ్ఞర్ ఎం.కరుణానిధి స్థాపించిన పార్టీ, పెరియార్ ఆత్మగౌరవ సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ తమదని చెప్పారు. తమిళనాడుకు కేంద్ర నిధులను రాబట్టేందుకే సీఎం స్టాలిన్ ఢిల్లీ వెళ్లారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలోనూ తమను భయపట్టాలనుకుందని, కానీ తాము లొంగలేదని చెప్పారు. తమది దాస్యం చేసే పార్టీకాదని, చట్టపరంగానే ఏ కేసులైనా ఎదుర్కొంటామని చెప్పారు. కాగా, కేంద్ర పన్నులల్లో రాష్ట్రానికి 50 శాతం షేర్ పెంచాలని నీతి ఆయోగ్ సమావేశంలో కేంద్రాన్ని ఎంకే స్టాలిన్ కోరారు.

## ఫాస్టాగ్‌లో కీలక మార్పులు తీసుకురాబోతున్న కేంద్రం..!

## ఈ పాస్‌తో ఇక హైవేలపై అన్‌లిమిటెడ్ ప్రయాణం..!




**న్యూఢిల్లీ NTM 963 న్యూస్ :** టోల్ వసూల్ వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురాబోతున్నది. కొత్త ప్రతిపాదిత ఫాస్టాగ్ విధానం ఉద్దేశం హైవేలపై ప్రయాణాన్ని ఇబ్బందులు లేకుండా సులభతరం చేయడమే. తరుచూ జాతీయ రహదారులపై ప్రయాణం చేసే వారికి కేంద్రం వార్షిక పాస్‌ను తీసుకురాబోతున్నది. సంవత్సరానికి ఒకే సారి రూ.3వేలు చెల్లిస్తే దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్టేట్ ఎక్స్‌ప్రెస్ హైవేలపై అపరిమితంగా ప్రయాణం చేసే సౌలభ్యం కలనుగన్నది. దాంతో తరుచూ ఫాస్టాగ్‌ను రీచార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం కేంద్రం ఫాస్టా విధానంలో రెండు కొత్త పద్ధతులను తీసుకురావాలని యోచిస్తున్నది. ఇందులో ఒకటి వార్షిక పాస్. వార్షిక సహాయంతో ఒక్కసారి ఫాస్టాగ్ ఫీజు చెల్లిస్తే సంవత్సరం మొత్తం అన్ లిమిటెడ్ హైవే జర్నీ చేసే అవకాశం ఉంటుంది. ఇందు కోసం అదనపు డాక్యుమెంట్స్ చూపించాల్సిన అవసరం కూడా ఉండదు. తక్కువ దూరం ప్రయాణించే వారు ప్రతి 100 వంద కిలోమీటర్లకు రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పటికే ఫాస్టాగ్‌ని ఉపయోగిస్తున్న వారి ఇలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని.. కొత్తగా అకౌంట్‌ని తెరవాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే పాత ఫాస్టాగ్ అకౌంట్ నుంచే కొత్త పాలసీని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. రూ.30వేలు చెల్లిస్తే 15 సంవత్సరాల పాటు 'లైఫ్‌టైమ్ ఫాస్టాగ్' ప్రతిపాదన సైతం తీసుకురాగా.. ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇదిలా ఉండగా.. కేంద్రం కొత్త టోల్ పాలసీలో ఎలాంటి ఆటంకాలు లేని వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. అంటే ప్రస్తుతం టోల్‌ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం ఇకపై ఉండదు. ప్రస్తుతం సెన్సార్ ఆధారిత వ్యవస్థను క్రమంగా తొలగించబోతున్నది. దాంతో ట్రాఫిక్ జామ్‌లు తగ్గనున్నాయి. పెట్రోల్, డీజిల్ సైతం ఆదా కానున్నది. టోల్ ఆదాయంలో మార్పును భర్తీ చేసేందుకు.. ప్రభుత్వం డిజిటల్ డేటా ఆధారంగా పరిహార ఫార్ములాను రూపొందిస్తోంది. తద్వారా టోల్ కాంట్రాక్ట్ తీసుకున్న కంపెనీలు నష్టపోకుండా ఉంటాయి. ఇంకా, కనీస ఫాస్టాగ్ బ్యాలెన్స్‌లను నిర్వహించడం వంటి చర్యలను అమలు చేయడం ద్వారా టోల్ ఎగవేతను పరిష్కరించడానికి బ్యాంకులకు మరిన్ని అధికారులు ఇవ్వనున్నది. ఫాస్టాగ్ పాలసీ ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. అమలులోకి వస్తే భారత్‌లోని కోట్లాది మంది వాహనదారులకు ప్రయాణం చౌకగా.. వేగంగా, సులభతరంగా మారనున్నది.

## మరో ఎన్‌కౌంటర్

మావోయిస్టు అగ్రనేత పప్పూ లో హరాసహా ఇద్దరు మృతి



**రాంచీ, NTM 963 న్యూస్ :** లతేహార్ జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, జార?ండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) అధినేత పప్పూ లోహరాతోపాటు మరో కీలక నాయకుడు ప్రభాత్ గంజ్ మరణించారు. ఈ ఘటనలో భద్రతా దళ సిబ్బంది ఒకరు గాయపడినట్టు అధికారులు చెప్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం లతేహార్‌లోని ఇచాబార్ అడవిలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో పప్పూ లోహరా మృతి చెందాడు. ఆయనపై రూ.10 లక్షల రివార్డు ఉంది. ఇదే ఎన్‌కౌంటర్‌లో జెజెఎంపి, మావోయిస్టు కీలక నాయకుడు ప్రభాత్ గంజ్ కూడా చనిపోయాడు. ప్రభాత్ గంజ్‌పై రూ.5 లక్షల రివార్డు ఉన్నది. ఈ కాల్పుల్లో తీవ్ర గాయాలపాలైన ఇంకో మావోయిస్టు సజీవంగా పట్టుబడ్డాడు. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ మావోయిస్టులకు వ్యతిరేకంగా భద్రతా బలగాల చర్యలు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో 24 మంది, బస్తర్ ప్రాంతంలో 33 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని అధికారులు తెలిపారు. వీరిలో 24 మందిపై రూ.91 లక్షల రివార్డు ఉన్నదని చెప్పారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందగా, వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ కూడా ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. శుక్రవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ నలుగురు మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే.

TGTEL/25/A0348

సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక




రిపోర్టర్స్ కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లా, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, మండల రిపోర్టర్స్ కావలెను

Cell: 9052045435, 9542522611

# దేశంలో జిల్లాకో ఫోరెన్సిక్ ల్యాబ్

## ఈ ఆర్థిక ఏడాదిలో నెలకొల్పేందుకు కృషి... ఫోరెన్సిక్ నెట్‌వర్క్ పటిష్టానికి చర్యలు: సంజయ్



**హైదరాబాద్, మే 24 NTM 963 న్యూస్ :** దేశంలోని ప్రతి జిల్లాలో ఫోరెన్సిక్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. దీంతో పాటు అధునాతన పరికరాలతో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను విస్తరిస్తామని చెప్పారు. న్యాయ ప్రక్రియలో 'ఫోరెన్సిక్-ఫస్ట్ అప్రోచ్'ను భాగం చేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'నూతన నేర చట్టాల నేపథ్యంలో ఫోరెన్సిక్ సైన్స్ సేవల బలోపేతం' అంశంపై చండీగఢ్‌లోని ఫోరెన్సిక్ సెంట్రల్ సైన్స్ ల్యాబోరేటరీ కార్యాలయంలో రెండు రోజులపాటు ఆలిండియా సీఎఫ్ఎసఎల్, ఎస్ఎఫఎల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. "కొత్త క్రిమినల్ చట్టాల అమలులో భాగంగా న్యాయ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చాలంటే ఫోరెన్సిక్ సేవలను ఇంకా బలోపేతం చేయడంతోపాటు ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది.

నేర దర్యాప్తులో ఫోరెన్సిక్ అధికారులు శాస్త్రీయ ఆధారాలను సేకరించడాన్ని కొత్త చట్టాలు తప్పనిసరి చేశాయి. అయితే, చాలా రాష్ట్రాల్లో ఇప్పటికీ సరైన ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాలు లేవు. శిక్షణ పొందిన శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉంది. దీంతో పెండింగ్ కేసులు న్యాయ ప్రక్రియను బలహీనపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలో ఆధునిక పరికరాలతో కూడిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లను స్థాపించటం, నేరస్థుల వద్దే ఆధారాలను సేకరించేందుకు మొబైల్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నాం. ఫోరెన్సిక్‌లో ఏఐ సాంకేతికతను ప్రవేశపెడుతున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ప్రతి జిల్లాలో ఒక ప్రభావవంతమైన ఫోరెన్సిక్ యూనిట్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక, శిక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని సంజయ్ వివరించారు. కాగా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భద్రత పెంచింది. ఇద్దరు నేతలకు టయోటా ల్యాండ్ క్రూజర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కేటాయించింది.

# రోడ్డుకు అడ్డుగా ఉన్న భవనం కూల్చివేత

### చూస్తుండగానే కుప్పకూలిన భవనం

### ఎక్స్‌కావేటర్‌పై పడిన భవన శిథిలాలు

### తప్పిన పెను ప్రమాదం

**కోల్‌సిటీ, మే 24 NTM 963 న్యూస్ :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని మార్కండేయకాలనీ ప్రధాన రహ దారిపై ఉన్న ఓ భవనం చూస్తుండగానే శనివారం ఒక్కసారిగా కుప్పకూలింది. భవన శిథిలాలు ఎక్స్ కావేటర్‌పై పడడంతో ఆపరేటర్ క్షేమంగా బయట పడ్డాడు. దీంతో పెనుప్రమాదం తప్పింది. రామ గుండం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కండే యకాలనీ రాజేష్ థియేటర్-అడ్డగుంటపల్లి 60 అడుగుల రహదారిలోని భవనాన్ని తొలగించా ల్సిందిగా గతంలో పలుమార్లు కార్పొరేషన్ యజమా నిని కోరింది. ఈ భవనం కొన్నేళ్లుగా ఖాళీగా ఉండడం, వర్షానికి స్లాబుల లీకేజీలతో శిథిలావస్థకు చేరింది. కార్పొరేషన్ ఇంజనీర్లు భవనం శిథిలావస్థకు చేరిందని, వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతు దంటూ కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా అత్యవసర పరిస్థితుల్లో భవనాన్ని కూల్చి వేసినట్టు కార్పొరేషన్ యంత్రాంగం పేర్కొంటుంది. శనివారం ఉదయం భవనం కూల్చివేసేందుకు కార్పొ రేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం ఎక్స్‌కావేటర్‌ను తీసుకువచ్చింది. రాజేష్ థియేటర్ వైపు ఉన్న భవ నం భాగాన్ని కూల్చివేస్తుండగా భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. రెండు అంతస్థుల భవనం ఒకేసారి కూలిపోవడంతో శిథిలాలు ఎక్స్‌కా వేటర్‌పై పడ్డాయి. ఆపరేటర్ క్షేమంగా బయటగా పడగా వాహనం బో ల్తా పడింది. ఒకేసారి భవనం కూలిపోవడంతో స్థాని కులు భయాందోళనకు గుర య్యారు. జనం పరు గులు పెట్టారు. పెద్ద ఎత్తున దుమ్ము వ్యాపించింది.

**- 20ఏళ్లుగా వివాదంలోనే భవనం..**



గోదావరిఖనిలో అభివృద్ధి చెందు తున్న ప్రాం తంలో ప్రధానమైన రాజేష్ థియేటర్, అడ్డగుంటపల్లి రహదారిని విస్తరించేందుకు కార్పొ రేషన్ ప్రయత్ని స్తున్నది. 60అడు గుల ఈ రహదారిని 80అడుగు లుగా మార్చాలని డిమాండ్ కూడా ఉంది. మార్కండేయకాలనీ ప్రధాన రహదారి ఆరంభంలోనే రోడ్డుపై భవనం ఉంది. ప్రధాన రహదారి విస్తరించినా ఈ భవనం తొలగించలేదు. భవన యజమాని కోర్టును ఆశ్రయించడంతో చట్ట ప్రకారం వ్యవహరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మొదట ప్రత్యామ్నాయ స్థలాన్ని ఆశించగా మున్సి పల్ చట్టం ప్రకారం సాధ్యం కాదని ప్రభుత్వం పేర్కొన్నది. దీంతో టీడీఆర్‌లు జారీ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. సుమారు 20ఏళ్లుగా ఇక్కడ విస్తరణ సాధ్యపడలేదు. భవనం రోడ్డుపై ఉండ డంతో అందులో వ్యాపారం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవ డంతో ఖాళీగా ఉంటుంది. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది.

**- భవనం కూల్చివేతలో రక్షణ చర్యల లోపం**

రామగుండం నగరపాలక సంస్థ శనివారం గోదావరిఖని మార్కండేయ కాలనీ ప్రధాన రహ దారిపై రోడ్డుపై ఉన్న భవనం కూల్చివేత సమ యంలో సరైన రక్షణ చర్యలు తీసుకోలేదనే విమ ర్శలు వస్తున్నాయి. సాధారణంగా రోడ్డు విస్తరణ సమయంలో కొంత భాగం కూల్చివేసే సమయంలో జనసంచారం నిలిపివేయడం, చుట్టుపక్కల కట్టడాల కు ఇబ్బందులకు కలుగకుండా తొలగించడం, విద్యుత్ సరఫరా నిలిపివేయ డం వంటి ముందస్తు చర్యలు తీసుకుంటారు. కానీ మార్కండేయకాలనీ రహదారిపై ఉన్న భవనం శిథిలావస్థలో ఉన్నది. కూల్చివేత సమయంలో డ్రిల్లింగ్ యంత్రాలు వినియోగించి పై స్లాబులు తొలగించిన తరువాత భవనాన్ని నేలమట్టం చేస్తారు. కానీ ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేసే ప్రయత్నం లోనే అకస్మాత్తుగా భవనం మొత్తం కూలిపోయింది. భవనం మొత్తం ప్రధాన రహదారి వైపు పడిపోయింది. విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడ్డా యి. ఈ పక్కన ఉన్న భవనాలకు నష్టం జరగకున్నా భవనం ఒక్కసారిగా కూలి పోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడంతో జన సంచారం లేకపోవడంవల్ల ఎలాంటి నష్టం జరగలేదు. శిథిల భవనాలను తొలగించిన సమయంలో సరైన రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు.

# అన్నారం బ్యారేజీ పునరుద్ధరణకు డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలి

## ప్రభుత్వానికి నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ లేఖ

## మేడిగడ్డ పునరుద్ధరణకు డిజైనర్‌ను నియమించాలని ఎల్ అండ్ టీ లేఖ

**హైదరాబాద్, మే 24 NTM 963 న్యూస్ :** కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ పునరుద్ధరణ/మరమ్మతులకు డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్మాణ సంస్థ అఫ్కాన్స్-విజేత-పీఈఎస జాయింట్ వెంచర్ ప్రభుత్వానికి లేఖ రాసింది. బ్యారేజీ పునరుద్ధరణకు అవసరమైన సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. నిధుల కొరత తీవ్రం గా ఉందని, ఈ నేపథ్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లు రూ.176.46 కోట్లు(ఓ అండ్ ఎం పనులకు సంబంధిం చి రూ.6.42 కోట్లు, ఎన్‌డీఎసఏ నిపుణుల కమిటీ మధ్యంతర సిఫారసులతో చేపట్టిన పనులకు సంబంధించి రూ.4.45 కోట్లు కలిపి) విడుదల చేయాలని లేఖ రాసింది. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎసఏ) మధ్యంతర సిఫారసుల్లో భూ సాంకేతిక పరీక్షలు తప్ప ఇతర అన్ని పనులు చేశామని గుర్తుచేసింది. వరద ఉధృతిని తగ్గించే వ్యవస్థలు లేనందువల్లే బ్యారేజీ దిగువ భాగంలో రక్షణ వ్యవస్థలు చెల్లాచెదురు అయ్యాయని తెలిపింది.

డిజైన్ లోపాల వల్లే బ్యారేజీ దిగువ భాగంలో సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు దెబ్బతిన్నాయని నివేదించింది. డ్యామ్ భద్రత సమీక్ష కమిటీ సభ్యులతో పాటు నీటిపారుదల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) అధికారుల బృందం అన్నారం బ్యారేజీలో స్టిల్లింగ్ బేసిన్‌తో పాటు కటాఫను పెంచాలని సూచించారని గుర్తుచే సింది. ఎన్‌డీఎసఏ పూర్తి నివేదిక అమలు కోసం నిపుణులైన సంస్థ లేదా డిజైన్ కన్సల్టెంట్‌ను నియమించాలని, ఎన్‌డీఎసఏ సూచనల ప్రకారం బ్యారేజీ పునరుద్ధరణకు డిజైన్ తయారుచేయాలని జాయింట్ వెంచర్ పేర్కొంది. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎసఏ) నివేదిక అమలు చేయడానికి 'రిహాబిలిటేషన్ డిజైనర్'ను నియమించాలని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కోరింది. ఈమేరకు నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. ఎన్‌డీఎసఏ మధ్యంతర నివేదిక ప్రకారం మేడిగడ్డలోని బ్లాక్-1-8ల దాకా భూభౌతిక పరీక్షలు కేంద్ర సంస్థలతో చేయించామని తెలిపింది. 2023 నవంబరు నుంచి 2024 దాకా కాఫర్ డ్యామ్‌తో పాటు రోడ్డును నిర్మించి, 2024 జూన్‌లో తొలగించామని, బ్లాక్-7 రక్షణ కోసం పనులు చేశామని పేర్కొంది. వానాకాలానికి ముందే 'రిహాబిలిటేషన్ డిజైనర్'ను నియమించాలని కోరింది. మధ్యంతర నివేదికలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.16.54 కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.



# కొణతం దిలీప్‌పై లుక్ అవుట్ సర్క్యులర్ తాత్కాలిక సస్పెన్షన్



**హైదరాబాద్, మే 24 NTM 963 న్యూస్ :** దాదాపు పది క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్‌కు వ్యతిరేకంగా పోలీసులు జారీచేసిన లుక్‌అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ను హైకోర్టు తాత్కాలికంగా జూన్ 11 వరకు సస్పెండ్ చేసింది. ఆ రోజు నాటికి అమెరికా నుంచి హైదరాబాద్‌కు కచ్చితంగా తిరిగి రావాలని స్పష్టం చేసింది. తండ్రి 15వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా పుస్తకావిష్కరణ కోసం అమెరికాలోని వర్జీనియా వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు జారీచేసిన ఎల్‌వోసీని కొట్టేయాలని దిలీప్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ జే శ్రీనివాసరావుల డివిజన్ బెంచ్ షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది.

### కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి కలెక్టర్‌కు నోటీసులు..

ఓ కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని హైకోర్టు సుమోటోగా ఇంప్లీడ్ చేసింది. ఆయన నల్లగొండ కలెక్టర్‌గా ఉన్నప్పుడు ముగ్గురు పార్ట్‌టైం ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని 2020లో హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అవి అమలు కాని నేపథ్యలో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలైంది. దాంతో కలెక్టర్ నారాయణరెడ్డిని సుమోటోగా ఇంప్లీడ్ చేసిన హైకోర్టు.. నాలుగువారాల్లో తమ ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీచేసింది.

### అంతర్జాతీయ స్థాయికి 'మై నేషన్' బ్రాండ్

తెలంగాణలోని ఆయా జైళ్లల్లో 'మై నేషన్' బ్రాండ్ పేరుతో ఖైదీలు తయారు చే స్తున్న ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది. ప్రపంచ అందా ల పోటీల సందర్భంగా శిల్పారామంలో జైలు ఉత్పత్తుల విక్రయ శాలను ఏర్పాటు చేశారు. అందాల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన సుందరీమణులు ఆ స్టాల్‌ను సందర్శించి ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల్ని పరిశీలించారు.మహిళా ఖైదీలు అల్లికలు, కట్లతో ప్రత్యేకంగా తయారు చేసిన వస్త్రాలపట్లవారు ఆకర్శితులయ్యారు.

# ఏసీబీకి చిక్కిన ముగ్గురు అవినీతి అధికారులు!?



**తెలంగాణ NTM 963 న్యూస్ :** రాష్ట్రంలో వేరువేరు ప్రాంతాల్లో లంచాలు తీసుకుంటూ ముగ్గురు అధికారు లు శుక్రవారం అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. వీరిలో ఒకరు జిహెచ్ ఎంసి సికింద్రాబాద్ జోనల్ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, కాగా.. మరొకరు కామారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఇంకొకరు మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట ఇన్చార్జి ఎంపీడీవో ఉన్నారు. హైదరాబాద్ లోని బేగంపేటకు చెందిన వెంకటరావు నుంచి రెండు భవనాలకు సంబంధించిన నిర్మాణ అనుమతుల సర్టిఫికెట్ కోసం ఎనిమిది లక్షలకు బేరం కుదరగా.. మొదట విడతగా 4 లక్షల రూపాయలు ముట్ట చెప్పిన విఠల్ రావు మరో నాలుగు లక్షల కోసం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో విఠల్ రావు, కార్యాలయంతో పాటు మేడిపల్లిలోని ఆయన నివాసం నల్లకుంటలోని ప్రైవేట్ ఆఫీసులో సోదాలు నిర్వహించారు. విఠల్ రావు,నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారి శ్రీధర్ తెలిపారు.

# ఎవరెస్ట్ ను అధిరోహించిన అంధురాలు



**NTM 963 న్యూస్ :** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్టు మహిళ అంధురాలు చొంజిన్ అంగ్మో అధిరోహించింది. లక్ష్యాన్ని చేరుకునేందుకు అంధత్వం అడ్డంకి కాదని నిరూపించి.. ఎవరెస్ట్ ఎక్కిన తొలి భారతీయ మహిళగా, ప్రపంచంలోనే ఐదో మహిళగా నిలిచారు. హిమాచలప్రదేశ్కు చెందిన అంగ్మో స్విమ్మింగ్లో గోల్డ్ మెడల్, జుడోలో జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్, మారథాన్లో 2 రజతాలు సాధించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డును అందుకున్నారు.

# కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు..
# 16 ఏళ్ల తర్వాత తొలిసారి

**న్యూఢిల్లీ NTM 963 న్యూస్ :** రైతన్నకు శుభవార్త. వ్యవసాయానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. సాధారణంగా ఏటా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. జూలై 8 వరకు అవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతం నుంచి సెప్టెంబర్ 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలవుతుంది. అది అక్టోబర్ 15 నాటికి ముగుస్తుంది. గతేడాది మే 30న నైరుతి రుతుపవనాలు రాగా, 2023లో జూన్? 8న ప్రవేశించాయి. 1918లో తొలిసారిగా చాలా తొందరగా కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. అప్పుడు మే 11నే రాష్ట్రాన్ని తాకాయి. ఇప్పటి వరకూ ఇదే తొలి రికార్డుగా ఉంది. ఇక రాష్ట్రాన్ని చాలా ఆలస్యంగా రుతుపవనాలు తాకింది 1972లోనే. అప్పుడు సాధారణం కంటే చాలా ఆలస్యంగా జూన్ 18న ప్రారంభమయ్యాయి.



### బంగాళాఖాతంలో అల్పపీడనం

అరేబియా మహాసముద్రంలో కొనసాగుతున్న అల్పపీడనం, ఈ నెల 27న పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండటంతో తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, ములు గు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఆ యా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించింది. అటు ఏపీలోనూ రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అరేబియా మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశముందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. వాయుగుండం తీవ్రవాయుగుండంగా లేదా తుఫాన్‌గా బలపడవచ్చని చెప్పారు. కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నదని తెలిపారు.

# పిచ్చి కుక్కలా పాక్ వ్యవహరిస్తోంది: అభిషేక్ బెనర్జీ



**టోక్యో NTM 963 న్యూస్ :** పాకిస్థాన్ ఉగ్ర చర్యల గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు భారత ఎంపీలకు చెందిన ఏడు బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే జపాన్‌కు వెళ్లిన బృందంలో తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ ఉన్నారు. టోక్యోలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదం రేబిస్ సోకి కుక్క అయితే, పాకిస్థాన్ ఆ జంతువును ఆడిస్తోందని ఆరోపించారు. ఆ పిచ్చి కుక్కను ఆటలు కట్టించేందుకు ప్రపంచం మొత్తం ఒక్కటి కావాలన్నారు. ఉగ్రవాదంపై పోరును ఆపబోమని, సీమాంతర ఉగ్రవాదాన్ని సహించబోమన్నారు. నిజాలు చెప్పేందుకు ఇక్కడకు వచ్చామని, ఇండియా వెనుకడుగు వేయబోదన్నారు.

జేడీయూ ఎంపీ సంజయ్ జా నేతృత్వంలోని ఎంపీల బృందం జపాన్‌కు వెళ్లింది. ఏడు బృందాలు మొత్తం 33 దేశ రాజధానులను విజిట్ చేయనున్నాయి. భయానికి తలొగ్గేది లేదని, వాళ్లకు అర్థం అయ్యే భాషలో చెప్పడం నేర్చుకున్నట్లు అభిషేక్ తన ప్రసంగంలో తెలిపారు. రేబిస్ సోకిన కుక్క తరహాలో పాకిస్థాన్ వ్యవహరిస్తోందని, ఒకవేళ ఆ మృగాన్ని అదుపు చేయకుంటే, అది మరిన్ని పిచ్చి కుక్కలను తయారు చేస్తుందని అభిషేక్ పేర్కొన్నారు. టోక్యోలో ఉన్న ఎంబసీలో భారతీయ సంతతి వ్యక్తులతో ఎంపీల బృందం మాట్లాడింది.

భారత్ చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందన్నారు. చాలా కచ్చితంగా తమ చర్యలు ఉంటాయని, ఎటువంటి కవ్వింపు ఉండబోదని తెలిపారు. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరాయి. అయితే మే 10వ తేదీన డీజీఎంవోల చర్చలతో సైనిక చర్యలు నిలిచాయి.

# అనుష్కతో 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్.. తేజ్‌ప్రతాప్ వెల్లడి



**పాట్నా NTM 963 న్యూస్ :** ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ సంచలన విషయం వెల్లడించారు. అనుష్క యాదవ్‌తో తనకు 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్ ఉన్నట్టు అంగీకరించారు. శనివారంనాడు తన ఫేస్‌బుక్ పేజ్‌లో అనుష్కతో తనకు చిరకాలంగా ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఇద్దరూ కలిసి దిగిన ఫోటోను షేర్ చేశారు. "నేను తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను. ఈ ఫోటోలో నాతో ఉన్నది అనుష్క యాదవ్. ఇద్దరం ఒకరికొకరు బాగా తెలుసు. 12 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నాం. 12 ఏళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నాం. చాలాకాలంగా ఈ విషయాన్ని అందరితో పంచుకోవాలని అనుకుంటున్నప్పటికీ అదెలాగో తెలియలేదు. ఈరోజు ఈ పోస్ట్‌తో నామనసులో ఏముందో మీతో పంచుకుంటున్నాను. మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని తేజస్వి యాదవ్ ఆ పోస్ట్‌లో రాశారు. తేజ్ ప్రతాప్ వ్యక్తిగత జీవితం చాలాకాలంగా చర్చనీయంశమవుతోంది. 2018లో బీహార్ మాజీ మంత్రి చంద్రికా రాయ్‌తో అట్టహాసంగా తేజ్ ప్రతాప్ వివాహం జరిగింది. అయితే కొద్దిరోజుల్లోనే విభేదాలు పొడచూపాయి. విడాకుల కోసం వెళ్లారు. ఆరేళ్లుగా పైగా కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ప్రస్తుతం తేజ్ ప్రతాప్ విదేశాల్లో ఉన్నారు. మాల్దీవుల్లో సముద్రం ఒడ్డున్న ధ్యానం చేసుకుంటున్న ఫోటోను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. కాగా, ఈ ఏడాది చివర్లో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వైశాలి జిల్లా మహువా నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంతకుముందు సమష్టిపూర్‌లోని హసన్‌పూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2015లో వ్యూహాత్మకంగా మహువా నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారు. ఈసారి కూడా అక్కడే పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# ఐదు జిల్లాల్లో అతిభారీ వర్షాలు..
# ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

**న్యూఢిల్లీ NTM 963 న్యూస్ :** తెలంగాణలో రానున్న ఐదురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. రాబోయే రెండుమూడు రోజుల్లో తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఏపీ వరకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని తెలిపింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఇక తెలంగాణలో రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశాలున్నాయని తెలిపింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదివారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని పేర్కొంది. 26న నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు పడుతాయని చెప్పింది.



27న కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురుస్తాయని చెప్పింది. 28న ఆదిలాబాద్, కుమ్రంభీ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# ఈపీఎఫ్‌పై వడ్డీ రేటును ప్రకటించిన కేంద్రం.. ఈ సారి ఎంతో తెలుసా..?

**న్యూఢిల్లీ NTM 963 న్యూస్ :** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ వడ్డీ రేటును కేంద్రం ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ ఖాతాలో




డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25శాతం వద్ద కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఫిబ్రవరి 28న జరిగిన సమావేశంలో వడ్డీ రేటును 8.25శాతం వద్దనే కొనసాగించాలని నిర్ణయించింది. అంతకుముందు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటును 0.10శాతం పెంచి 8.15శాతానికి పెంచిన విషయం తెలిసిందే. 2022-23లో 0.05శాతం పెంచి 8.10శాతం నుంచి 8.15శాతానికి పెంచింది. 2022లో ఈపీఎఫ్‌వో ఏడుకోట్ల మందికిపైగా చందాదారుల కోసం 2021-22 సంవత్సరానికి ఈపీఎఫ్‌వో వడ్డీని నాలుగు దశాబ్దాలకుపైగా 8.1శాతానికి తగ్గించింది. ఈ వడ్డీ రేటు 2020-21లో 8.5 శాతంగా ఉంది. అంతకుముందు 2020-21 సంవత్సరానికి ఈపీఎఫ్‌పై 8.10 శాతం వడ్డీ రేటు ఉండగా.. 1977-78 తర్వాత ఇదే అత్యల్పం. ఆ సమయంలో ఈపీఎఫ్ వడ్డీ రేటు కేవలం ఎనిమిది శాతం మాత్రమే.

అయితే, ఈపీఎఫ్‌వో ??2019-20కి ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ఏడు సంవత్సరాల కనిష్ట స్థాయి 8.5 శాతానికి తగ్గించింది. ఇది 2018-19లో 8.65 శాతంగా ఉన్నది. ఈపీఎఫ్‌వో చందాదారులకు 2016-17లో 8.65 శాతం వడ్డీ రేటును, 2017-18లో 8.55 శాతం వడ్డీ రేటును అందించింది. వడ్డీ రేటు కొంచెం ఎక్కువగా ఉంది. 2015-16లో 8.8 శాతం చెల్లించింది. రిటైర్మెంట్ ఫండ్ బాడీ 2013-14.. 2014-15లో 8.75 శాతం వడ్డీని ఇచ్చింది. ఇది 2012-13లో 8.5 శాతం కంటే ఎక్కువగా ఉంది. 2011-12 సంవత్సరంలో వడ్డీ రేటు 8.25 శాతంగా ఉన్నది.

# 'మైసూర్ పాక్‌ను మైసూర్ పాక్ అనే పిలవండి'.. కకాసుర మడప్ప మునిమనవడి సూచన



**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్ర దాడి, ప్రతిగా ఆపరేషన్ సింధూర్, ఆపై భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశంపై యావత్ భారతీయులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఓ స్వీట్ల షాపు యజమాని తన షాపులో మైసూర్ పాక్ పేరును 'మైసూర్ శ్రీ' గా మార్చాడు. ఇది నెట్టింట్లో వైరల్‌గా మారింది. దాంతో దీనిపై రాయల్ కుక్ కకాసుర మడప్ప మునిమనవడు ఎస్ నటరాజ్ స్పందించారు.

ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ మైసూర్ పాక్ పేరు మార్పుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అది చారిత్రక వంటకమని, దాని పేరులోని పాక్‌కు, పాకిస్థాన్‌కు సంబంధం లేదని చెప్పారు. 'మైసూర్ పాక్‌ను మైసూర్‌పాక్ అనే పిలవండి. మన పూర్వీకులు అందించిన ఆవిష్కరణకు ఇంకో పేరు ఉండదు. కన్నడలో అంటే చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థం అని అర్థం. దీనిని తొలుత మైసూర్‌లో తయారు చేయడంవల్ల మైసూర్, పాకా కలిసి మైసూర్ పాక్ అని పేరు వచ్చింది. దీనిని వేరే పేరుతో పిలవడం అనవసరం. దీనికి వేరే అర్థాలు తీయొద్దు' అని నటరాజ్ కోరారు.

మైసూర్‌లోని వడయార్ రాజకుటుంబానికి కకాసుర మడప్ప వంటవాడిగా ఉండేవారు. ఈ స్వీట్‌ను తొలుత తయారు చేసిన క్రెడిట్ ఆయనకే దక్కింది. మైసూర్ పాక్‌కు అప్పట్లో ఆయన పెట్టిన పేరును ఇప్పుడు మార్చడంపై నటరాజ్ అభ్యంతరం తెలియజేశారు. కాగా జైపుర్‌లోని ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' దుకాణం యజమాని.. మైసూర్ పాక్, మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని మార్చాడు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషం పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేశాడు.

అయితే ఈ పేర్ల మార్పుపై 'త్యోహార్ స్వీట్స్' దుకాణం యజమాని అంజలీ జైన్ మాట్లాడుతూ.. 'దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నాం' అన్నారు. పాక్ అనే పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేకపోయినా ఆ శబ్దం పాకిస్థాన్‌ను గుర్తుచేసేలా ఉండటంతో పేరు మార్చినట్లు తెలిపారు. శుభానికి సూచికగా 'శ్రీ' అనే పదం పెట్టినట్లు చెప్పారు.

# బయటపడిన ఆర్సీబీ వీక్‌నెస్.. ఈసారీ కప్పు కష్టమే!

ఐపీఎల్-2025 ఆరంభంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మీద ఎవరికీ పెద్దగా ఆశల్లేవు. కానీ సీజన్ ముందుకు సాగుతున్న కొద్దీ వరుస విజయాలతో ఫేవరెట్స్‌లో ఒకటిగా మారింది ఆర్సీబీ. సగం మ్యాచులు పూర్తయ్యేసరికి టాప్ స్పాట్‌కు చేరుకుంది. సీజన్ రీస్టార్ట్ అవగానే ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకొని ఈసాలా కప్ నమ్దే అంటూ అభిమానుల్లో జోష్ నింపింది. అయితే ఒకే ఒక్క ఓటమి ఆ టీమ్‌లోని పలు బలహీనతల్ని బయటపెట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన పోరులో 42 పరుగుల భారీ తేడాతో పరాభవం పాలైంది కోహ్లీ టీమ్. ఈ ఓటమితో ఫైనల్ అవకాశాల్ని సంక్లిష్టం చేసుకోవడమే గాక తమ అభిమానుల్ని ఆందోళనలోకి నెట్టేసింది. అసలేం జరిగిందంటే..



### అంతా హ్యాండ్సప్

సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్.. రెండింట్లో దారుణంగా విఫలమైంది ఆర్సీబీ. భువనేశ్వర్ కుమార్, లుంగి ఎంగిడి, సుయాష్ శర్మ, యశ్ దయాల్ ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. రొమారియో షెఫర్డ్ తప్పితే అందరూ వికెట్ల వేటలో వెనుకబడ్డారు. బ్యాటింగ్‌లో సాల్ట్-కోహ్లీ అద్భుతమైన ఆరంభం అందించినా లాభం లేకపోయింది. మయాంక్ అగర్వాల్, రజత్ పాటిదార్, జితేష్ శర్మ, కృనాల్ పాండ్యా.. ఇలా అందరూ విఫలమయ్యారు. మంచి స్టార్ట్‌ను యూజ్ చేసుకోలేదు. వీళ్లలో ఏ ఇద్దరు ఆఖరి వరకు బ్యాటింగ్ చేసినా టీమ్ విజయానికి చేరువయ్యేది. బౌలింగ్‌లో రాణించిన షెఫర్డ్.. బ్యాటింగ్‌లో చేతులెత్తేశాడు. టిమ్ డేవిడ్ గాయం కూడా టీమ్‌కు బిగ్ మైనస్‌గా మారింది.

### కోహ్లీ ఆడకపోతే అంతేనా..

కోహ్లీ ఔట్ అయితే ఆర్సీబీ పరిస్థితి అంతేనా.. చేజింగ్‌లో చేతులెత్తేయడం తప్ప వేరే ఆప్షన్ లేదా.. అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 200కి పైచిలుకు టార్గెట్‌ను ఛేదించడం బెంగళూరుకు కష్టమేనా అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. మిడిలార్డర్-లోయరార్డర్‌లో ఒక్కడంటే ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలబడకపోవడం, పట్టుదలతో ఆడకపోవడంతో ప్లేఆఫ్స్‌లో ఇలాగే ఆడితే కప్పు వచ్చినట్లే అని సోషల్ మీడియాలో నెటిజన్స్ సెటైర్స్ వేస్తున్నారు. గాయంతో బాధపడుతున్న టిమ్ డేవిడ్ మిగిలిన మ్యాచుల్లో ఎంతవరకు ఆడతాడో చెప్పలేని పరిస్థితి. హేజల్‌వుడ్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఎంగిడి ప్లేఆఫ్స్‌కు ముందే సౌతాఫ్రికా ఫ్లైట్ ఎక్కేస్తాడు. దీంతో బెంగళూరు కష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. బ్యాటింగ్‌లో కోహ్లీ మీద అతిగా ఆధారపడటం బలహీనత అనే చెప్పాలి. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ఇలా చాలా వీక్‌నెస్‌లు బయటపడటంతో తదుపరి మ్యాచుల్లో వీటిని అధిగమిస్తే గానీ ట్రోఫీ కలను కోహ్లీ టీమ్ నెరవేర్చుకోవడం కష్టంగానే కనిపిస్తోంది.

# ఫైనల్ చేరాలంటే ఇంకా ఎన్ని మ్యాచ్‌లు గెలవాలి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శనతో అభిమానులకు ఆశలను రేపింది. కానీ నిన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం ఓడిపోయింది. అయినప్పటికీ ఆర్సీబీ పోటీలో ఉంది. కానీ ఫైనల్‌కు చేరాలంటే మరింత కష్టపడాల్సి వస్తుంది. ఆర్సీబీ ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)తో మే 27న లక్నోలో మొదట తలపడనుంది. ఆ తర్వాత ఇంకో మ్యాచ్ ఆడనుంది.

### ఓడిన జట్టు

ఒక మ్యాచ్ గెలిస్తే ఆర్సీబీ 19 పాయింట్లకు చేరుకుంటుంది. రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఆర్సీబీ 21 పాయింట్లతో లీగ్ దశకు చేరుకుంటుంది. ఇది టాప్-2 స్థానాన్ని సాధించే అవకాశాన్ని ఇస్తుంది. టాప్-2లో ఉండటం వల్ల క్వాలిఫయర్ 1లో ఆడే అవకాశం లభిస్తుంది. ఇది ఫైనల్‌కు నేరుగా ఒక అవకాశాన్ని ఇస్తుంది. ఐపీఎల్ 2025 ప్లే-ఆఫ్ ఫార్మాట్ ప్రకారం, టాప్-2 జట్లు క్వాలిఫయర్ 1లో ఆడతాయి, ఇందులో విజేత నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. ఇందులో ఓడిన జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. క్వాలిఫయర్ 1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో ఆడి, ఫైనల్‌కు చేరే రెండో జట్టుగా నిలుస్తుంది.

### ఆర్సీబీ ఫైనల్‌కు చేరాలంటే:

రెండు లీగ్ మ్యాచ్‌లలో విజయం సాధిస్తే, ఆర్సీబీ 21 పాయింట్లతో టాప్-2లో నిలిచే అవకాశం ఉంది. ఇది క్వాలిఫయర్ 1లో ఆడే అవకాశాన్ని ఇస్తుంది. ఇక్కడ విజయం నేరుగా ఫైనల్‌కు తీసుకెళ్తుంది. మూడు లేదా నాలుగో స్థానం ఒక మ్యాచ్ గెలిచి, 19 పాయింట్లతో ప్లే-ఆఫ్‌కు అర్హత సాధిస్తే, ఆర్సీబీ ఎలిమినేటర్‌లో ఆడవచ్చు. ఇక్కడ విజయం సాధిస్తే, క్వాలిఫయర్ 2లో మరో మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది. ఒకవేళ ఇతర జట్లు 17 లేదా 19 పాయింట్లతో సమానంగా నిలిస్తే, నెట్ రన్ రేట్ నిర్ణయాత్మకంగా మారుతుంది. ఆర్సీబీ ప్రస్తుత ఎన్ఆర్ఆర్ (0.255) సానుకూలంగా ఉన్నప్పటికీ, పెద్ద స్కోరుతో విజయాలు సాధించడం చాలా ముఖ్యం.

### ఇప్పటివరకు 74 మ్యాచ్‌లు..

ఐపీఎల్ 2025 18వసీజన్‌లో ఇప్పటివరకు 74 మ్యాచ్‌లలో 70 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఆర్సీబీ 13 మ్యాచ్‌లు ఆడి, 17 పాయింట్లతో పాయింట్ల టేబుల్‌లో మూడో స్థానంలో ఉంది (నెట్ రన్ రేట్: 0.255). గుజరాత్ టైటాన్స్ (18 పాయింట్లు) తొలి స్థానంలో ఉండగా, పంజాబ్ కింగ్స్ (17 పాయింట్లు)రెండో స్థానంలో, ముంబై ఇండియన్స్ (16 పాయింట్లు) నాలుగో స్థానంలో ఉన్నాయి. ఎస్ఆర్‌హెచ్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), లక్నో ఇప్పటికే ప్లే-ఆఫ్ రేసు నుంచి తప్పుకున్నాయి.

# ‘ఆపరేషన్ సిందూర్’లో 200 మంది పాకిస్థానీల మృతి!

**న్యూఢిల్లీ, లక్నో, అహ్మదాబాద్, NTM 963 న్యూస్ :** పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ‘ఆపరేషన్ సిందూర్’ దాడుల్లో 200 మందికిపైగా పాకిస్థానీలు మరణించారు! వీరిలో అత్యధికులు ఉగ్రవాదులు కాగా, మిగిలినవారు సైనికులు. రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా రాసిన కథనాల ప్రకారం, ఈ నెల 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరులలోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసింది. ఈ దాడుల్లో 170 మంది ఉగ్రవాదులు మరణించారు. అవమాన భారంతో ఊగిపోతున్న పాక్ ఎప్పుడైనా దాడి చేసే అవకాశం ఉండటంతో



భారత దళాలు అప్రమత్తంగా ఉన్నాయి.

### ‘పహల్గాం’కు ముందు పాక్‌కు హరూన్

గూఢచర్యం ఆరోపణలపై యూపీ పోలీసులు అరెస్ట్ చేసిన మహమ్మద్ హరూన్ పహల్గాం ఉగ్ర దాడికి ముందు పాకిస్థాన్‌కు వెళ్లినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. హరూన్ ఢిల్లీలో తుక్కు వ్యాపారం చేస్తుంటాడు. అతను పాకిస్థానీ అమ్మాయిని రెండో పెండ్లి చేసుకున్నాడు. ఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయం అధికారి ముజమ్మల్ హుస్సేన్‌తో హరూన్‌కు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

### గూఢచర్యం చేస్తున్న మరో వ్యక్తి అరెస్ట్

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ వ్యక్తిని గుజరాత్ ఏటీఎస్ అరెస్ట్ చేసింది. ఐఏఎఫ్, బీఎస్ఎఫ్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అతడు పాకిస్థాన్ ఏజెంట్లకు చేరవేస్తున్నట్టు అధికారులు తెలిపారు. నిందితుడు సహదేవ సింగ్ గోహిల్ (28)ను ఓ హెల్త్ వర్కర్‌గా గుర్తించారు.

### పాక్ చొరబాటుదారుడి కాల్చివేత

గుజరాత్‌లోని బనాస్‌కాంతా జిల్లాలో శుక్రవారం రాత్రి అక్రమంగా భారతీయ సరిహద్దుల్లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఓ పాకిస్థాన్ జాతీయుడిని బీఎస్ఎఫ్ సిబ్బంది కాల్చివేశారు.

# ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యారణంపై ప్రభావం ఉంటుంది... లయన్ అన్నెం కోటిరెడ్డి





**హైదరాబాద్ NTM 963 న్యూస్ :-** ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యారణం పై ప్రభావం ఉంటుందని లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు.ప్రతి వారం సామాజిక సేవలో ఆయన పర్యావరణ పరిరక్షణ లో బాగం గా తన వంతు ప్లాస్టిక్ వ్యర్ధ నిర్మూలన కై ఉద్యమ రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమంలో భాగంగా బోయనపల్లి లో ఉన్న అతిపెద్ద రైతు మార్కెట్ లో ప్లాస్టిక్ వలన జరిగే అనర్దాలు గురించి వివరించి, కొంతమంది కి గుడ్డ సంచులు ను ఉచితంగా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విపరీతం గా ప్లాస్టిక్ సంచుల వినియోగం వ్యర్థాల నిర్మూలన వ్యవస్థను మరింత దెబ్బతీసింది. ప్లాస్టిక్ సంచుల తయారీలో ఉపయోగించే రసాయనాలు మురుగునీటి ప్రవాహాన్ని నిరోధించి భూగర్భ జలాలను కలుషితం చేయడానికి దారితీస్తుంది. పర్యావరణంపై ప్లాస్టిక్ యొక్క హానికరమైన ప్రభావాలు అంతులేనివి. చెత్తకుప్పలలోని ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి మరియు నీటి వనరులను విషపూరిత రసాయనాలతో కలుషితం చేస్తాయి, చుట్టుపక్కల ప్రాంతాలలో నేల సంతానోత్పత్తి, నీటి నాణ్యతను తగ్గిస్తాయి. పర్యావరణంపై ప్లాస్టిక్ యొక్క హానికరమైన ప్రభావాలు వన్యప్రాణులలో కూడా కనిపిస్తాయి. జంతువులు బ్యాగులు, బాటిల్ మూతలు వంటి ప్లాస్టిక్‌ను తింటాయి. దీని ఫలితంగా ఉక్కిరిబిక్కిరి కావడం లేదా తీవ్రమైన అంతర్గత అవరోధం కారణంగా మరణం సంభవించవచ్చు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఉష్ణమండల తీరప్రాంత జలాల్లోని పర్యావరణ వ్యవస్థలను బెదిరిస్తాయి, చేపలు, సముద్ర పక్షులు, తాబేళ్లను ప్రమాదంలో పడేస్తాయి, ఇవి సులభంగా దానికి బలైపోతాయి.ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణంపై ప్రభావం చూపడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, డయాక్సిన్ల మిశ్రమాన్ని కలిగి ఉన్న విషపూరిత పొగలు గాలిలోకి విడుదలవుతాయి, తద్వారా శ్వాసకోశ వ్యాధులు ప్రభావితమవుతాయి. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణంపై ప్లాస్టిక్ హానికరమైన ప్రభావాలు ఏర్పడటానికి మరొక ఉదాహరణ ప్లాస్టిక్ మురుగునీటి పారుదల వ్యవస్థల కారణంగా వరదలు సంభవించడం. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణంపై కలిగే హానికరమైన ప్రభావం నీటి ద్వారా సంక్రమించే వ్యాధులకు కూడా దారితీస్తుందని ఆయన తెలిపారు.

### ప్లాస్టిక్ కోసం ప్రత్యామ్నాయాలు... !!

ప్లాస్టిక్ సంచులకు బదులు నార, గుడ్డ సంచులు వేయాలని కోటిరెడ్డి అన్నారు. దానికి ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. కాగితపు సంచులను తయారు చేయడం పరిమిత వృక్షసంపద నాశనానికి దారితీస్తుంది. సహజసిద్ధంగా కుళ్లిపోయే ప్లాస్టిక్‌ను సేంద్రియ పదార్థంగా అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు.

### సింగిల్ యూజ్ ప్లాస్టిక్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లేదా డిస్పోజబుల్ ప్లాస్టిక్ అనేది డిస్పోజబుల్ ప్లాస్టిక్. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లో ప్లాస్టిక్ సంచులు, స్ట్రాస్, కాఫీ, టీ కలపడానికి ఉపయోగించే చిన్న ముక్కలు, నీటి సీసాలు, ఆహారం, శీతల పానీయాలను చుట్టడానికి ఉపయోగించే ప్లాస్టిక్ ఉన్నాయి. ప్రపంచం ప్రతి సంవత్సరం దాదాపు 300 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. వీటిలో సగం ఒకే ఉపయోగం కోసం వాడతారు. తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించారని ఆయన అన్నారు..

# పోలవరం ఎత్తిపోతలకు తెలంగాణ అభ్యంతరం

పిపిఎ, జిఆర్ఎంబికి లేఖ



**హైదరాబాద్ NTM 963 న్యూస్ :** పోలవరం నీటిపారుదల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల పట్ల తెలంగాణ సర్కారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గోదావరి బోర్డుతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ)కి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) జి అనిల్‌కుమార్ లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్టు ఏప్రిల్ ఎనిమిదిన జరిగిన పిపిఎ సమావేశంలో పోలవరం చీఫ్ ఇంజనీర్ తెలిపినా, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ సన్నాహాలు చేపట్టిందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని వివరించారు. దీంతో గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వస్తుందని లేఖలో తెలియజేశారు. ప్రధానంగా పోలవరం డెడ్‌స్టోరేజీ నుంచి నీటిని పోత్తిపోయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతూనే మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్‌స్టోరీజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం ఎంతవరకు సమంజమని అభ్యంతరం చెప్పారు. డెడ్‌స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సిడబ్ల్యుసి మార్గదర్శకాలు, అనుమతులకు విరుద్ధమని పేర్కొన్నారు. సిడబ్ల్యుసి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యతిరేకంగా ఉందని లేఖలో వివరించారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ముందుకు పోకుండా ఆపాలని విజ్ఞప్తి చేశారు.

Printed Published Owned by: Setti Venkatesh. Printed at Sri Lakshmi Offcet Printers & Binders: 3-82, Singavaram, Ananthagiri(m), SURYAPET(Dist), Telangana, 508206.
Editor : Setti Venkatesh. Phone No : 90520 45435. Website : https://ntm963news.com. Mail ID: ntm963news@gmail.com.